సాక్షి
వికారాబాద్

శుక్రవారం ⁝ 9 ⁝ జూన్ ⁝ 2023



ఇదేం పద్ధతి

దశాబ్ది ఉత్సవాలను ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరోక్షంగా అడ్డుకోవడం ఏమిటని పుట్ట పహాడ్ వాసులు మండిపడ్డారు. 10లో▸



రైతు సంక్షేమానికి పెద్ద పీట

రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. 10లో▸



క్రీడలతో స్నేహభావం

క్రీడలతో స్నేహభావం పెరుగుతుందని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

రేపు సుపరిపాలన దినోత్సవం

వికారాబాద్ అర్బన్: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 10న సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం టెలికాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. శనివారం ఉదయం 10:30 గంటలకు కలెక్టరేట్‌లో కార్యక్రమం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రొటోకాల్ ప్రకారం ప్రజాప్రతినిధులందరినీ ఆహ్వానించాలన్నారు. జిల్లా అధికారులు వారి సిబ్బందితో కలిసి పాల్గొనాలని తెలిపారు. ఆయా శాఖల ద్వారా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు ప్రజలకు తెలిసేందుకు కరపత్రాలను ముద్రించాలన్నారు.

జిల్లా కోర్టులో తాత్కాలిక పద్ధతిన ఉద్యోగాలు

వికారాబాద్ అర్బన్: లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టమ్ కార్యాలయంలో తాత్కాలిక నియామకాల కింద దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా న్యాయ సేవ అధికారి సంస్థ చైర్మన్ అండ్ ప్రిన్సిపల్ జిల్లా సెషన్స్ జడ్జి కె. సుదర్శన్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లా న్యాయసేవ అధికార సంస్థలో ఆఫీస్ అసిస్టెంట్, క్లర్క్ రిసెప్షనిస్టు కం డాటా ఎంట్రీ ఆపరేటర్, ఆఫీస్ ప్యూన్ గా పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 15న 5 గంటలలోగా జిల్లా కోర్టులో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు 18 ఏళ్లు నిండి జూలై 2023 నాటికి 34 సంవత్సరాలలోపు వారై ఉండాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఐదేళ్లు, వికలాంగులకు పదేళ్ల వయసు సడలింపు ఉంటుందన్నారు. ఆఫీస్ అసిస్టెంట్, క్లర్క్ పోస్టులకు విద్యార్హత డిగ్రీతో పాటు కంప్యూటర్ పరిజ్ఞానం ఉండాలన్నారు. రిసెప్షనిస్ట్ కం డాటా ఎంట్రీ ఆపరేటర్ పోస్టుకు డిగ్రీతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్ ఉండాలని, ఆఫీస్ ప్యూన్ పోస్టుకు 7వ తరగతి విద్యార్హత కలిగి ఉండాలన్నారు.

మీనం మిలమిల



పరిగిలో చేపలు కొనుగోలు చేస్తున్న ప్రజలు

పరిగి: మృగశిర కార్తె గురువారం ప్రారంభమైంది. కార్తె మొదలైన రోజున చేపలు తినడం ఆనవాయితీ. ఈ నేపథ్యంలో చేపల కోసం జనం పరుగులు పెట్టారు. పరిగి మార్కెట్‌లో వివిధ రకాల చేపలను మత్స్యకారులు అందుబాటులో ఉంచారు. చేపలకు డిమాండ్ ఉండటంతో బొచ్చ, రవ్, తదితర చేపలు రూ. 150, కొర్రమీను రూ. 500 వరకు ధర పలికింది.

అత్యవసర చికిత్స కేంద్రం మంజూరు

వికారాబాద్ అర్బన్: జిల్లా కేంద్రానికి క్రిటికల్ కేర్ ఆస్పత్రి (అత్యవసర చికిత్స కేంద్రం) మంజూరైనట్లు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని పేద ప్రజలకు అత్యవసర వైద్యం అందాలంటే హైదరాబాద్ వెళ్లాల్సి వచ్చేదని, ఉస్మానియా, గాంధీ వంటి ఆస్పత్రుల్లోనే అత్యవసర వైద్యం అందుబాటులో ఉందన్నారు. అలాంటి అత్యవసర వైద్యం వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రభుత్వం అనుమతిచ్చినట్లు తెలిపారు. అత్యవసర చికిత్స ఆవశ్యకతను సీఎం కేసీఆర్‌కు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావుకు వివరించడంతో అత్యవసర చికిత్స కేంద్రాన్ని కేటాయించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు కేంద్రాలు మాత్రమే మంజూరు కాగా అందులో వికారాబాద్‌కు ఒకటి కేటాయించినట్లు తెలిపారు. సుమారు రూ.28.34 కోట్ల వ్యయంతో 50 పడకల అత్యవసర చికిత్స విభాగాన్ని మంజూరు చేసినట్లు తెలిపారు.

ఎస్పీని కలిసిన నూతన ఏఎస్పీ



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఏఎస్పీ

అనంతగిరి: హైదరాబాద్‌లో విధులు నిర్వహిస్తూ జిల్లా ఏఎస్పీగా బదిలీపై వచ్చిన శ్రీనివాసరావు గురువారం ఎస్పీ కోటిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా నగరంలో పనిచేస్తూ ఏఓగా బదిలీపై వచ్చిన జ్యోతిర్మయి కూడా ఎస్పీని కలిశారు.



తాండూరు రూరల్: చెంగోల్‌లో చెరువు వద్దకు బోనాలు, బతుకమ్మలతో తరలివస్తున్న ప్రజలు



పెద్దేముల్: జనగాంలో బోనాలతో మహిళలు



తాండూరు రూరల్: ఎల్మకన్నెలో చెరువుకట్ట వద్ద గ్రామస్తుల పూజలు

చెరువంత సంబురం

ఊరూరా చెరువుల పండుగ కనులపండువగా జరిగింది. రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా అంతటా చెరువుల పండుగ నిర్వహించారు. ఆషాఢం బోనాలను తలపించేలా, పల్లె సంస్కృతి ఉట్టిపడేలా ఉత్సవాలు కొనసాగాయి. డప్పువాయిద్యాలతో మహిళలు బోనాలతో చెరువుల వద్దకు తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు. ఆడిపాడారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.



వికారాబాద్ అర్బన్: సర్పన్‌పల్లి చెరువు వద్ద ఎమ్మెల్యే, కలెక్టర్, అదనపు కలెక్టర్ కోలాటం

కల్లాల్లోనే ధాన్యం!

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు అస్తవ్యస్తంగా మారింది. కొనుగోలు కేంద్రాల్లో ఎటుచూసినా ధాన్యం బస్తాలు కనిపిస్తుండగా.. మరోవైపు కల్లాల్లోని ధాన్యం ఇంకా కదలడంలేదు. 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనాలని లక్ష్యంగా పెట్టుకున్నా ఇప్పటి వరకు 50 శాతం కూడా కొనలేదంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం అవుతోంది. అధికారుల అలసత్వం.. కొరవడిన ముందుచూపు.. నేతల లోపాయికారి తనం రైతుల పాలిట శాపంగా మారుతోంది.

నత్తనడకన కొనుగోళ్లు

- ఉరుముతున్న వరుణుడు
- ఆందోళనలో రైతన్న
- లక్ష మెట్రిక్ టన్నులకుపైగా దిగుబడులు పొలాల్లోనే
- టార్గెట్‌లో సగం కూడా కొనుగోలు చేయని దైన్యం
- వేధిస్తున్న ట్రాన్స్‌పోర్ట్ సమస్య
- అధికారుల్లో కొరవడిన ముందుచూపు



రైతులు కల్లాల్లోనే నిల్వ ఉంచిన ధాన్యం

వికారాబాద్: ధాన్యం పండించిన రైతు పరిస్థితి దైన్యంగా మారింది. వర్షాకాలం ముంచుకొచ్చినా.. ఇంకా కొనుగోళ్లు చేస్తూనే ఉన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం సైతం ట్రాన్స్‌పోర్టు సమస్యతో కొనుగోలు కేంద్రాల్లోనే నిలిచిపోయింది. ట్రాన్స్‌పోర్టు నిర్వాహకులు సరిపడా లారీలు సమకూర్చక పోవడంతో వేల బస్తాల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయింది. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆర్డీఓ, రెవెన్యూ, పోలీసు అధికారులను ఆశ్రయించి లారీలను బలవంతంగా తెప్పించుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది. అయితే జిల్లాలో సరిపడా గోదాములు లేకపోవటం, మిల్లుల సామర్థ్యం తక్కువగా ఉండటం, అధికారులకు ముందస్తు ప్రణాళిక లేకపోవటం కూడా సమస్యకు కారణమవుతోంది. మరో పక్క వర్షాలు కురుస్తుండటం కూడా రైతుకు కంటిమీద కునుకులేకుండా చేస్తోంది.

93 వేల ఎకరాల్లో వరి సాగు

వేసవి సీజన్‌లో జిల్లాలో 93 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా ఇందులో సుమారు రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేశారు. ఇందులో 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం ఈ సీజన్‌లో కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 129 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసిన సివిల్ సప్లై అధికారులు ఇప్పటి వరకు 58 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే సేకరించారు. ఇందులో 48 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించగా సకాలంలో లారీలు రాక ఇంకా 10వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కేంద్రాల్లోనే ఉండిపోయింది. జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం పండిందని అంచనా వేస్తుండగా 48 వేల మెట్రిక్ టన్నులు నిల్వ చేసుకునే సామర్థ్యం మాత్రమే మన జిల్లాలో ఉంది. ఇప్పటి వరకు కళ్లు తెరవని అధికారులు ఇప్పుడు హడావిడిగా షాద్‌నగర్, మహబూబ్‌నగర్, మొయినాబాద్‌లలో మూడు గోదాములు తీసుకుని అక్కడికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

పొలాల్లోనే ధాన్యం..

రైతన్నలు ఆరుగాలం పంట పండించేందుకు ఎంత కష్టమవుతుందో.. పండించిన పంటను అమ్ముకోవటానికి అంతకంటె ఎక్కువ శ్రమ పడాల్సి వస్తోంది. ఓ వైపు మేఘాలు ఉరుముతుంటే ఇంకా లక్షకు పైగా మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్దే ఉండంటే సమస్య అర్థం అవుతుంది. కొనుగోలు ప్రక్రియలో జరుగుతున్న తీవ్ర జాప్యం కారణంగా రైతులు తాము పండించిన ధాన్యం నిల్వ చేసేందుకు ఇళ్లలో స్థలంలేక కొనుగోలు కేంద్రాలకు వెంటనే తరలించేందుకు వీలుకాక ఇంకా పొలాల్లోనే పెట్టుకుని పడిగాపులుకాస్తున్నారు.

నిర్వాహకుల కొర్రీలతో సతమతం

కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల కొర్రీలు.. మరో పక్క వెంటాడుతున్న వరుణుడితో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. తేమ, తాలు పేరుతో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రైతులను పదే పదే తిప్పి పంపుతున్నారు. చేసేదిలేక ధాన్యం కల్లాల్లోనే పెట్టుకుని పడిగాపులు గాస్తున్నారు. కొందరు చేసేది లేక తక్కువ ధరలకే దళారులకు విక్రయిస్తుండగా మరికొందరు కొనుగోలు కేంద్రాలు, రైస్ మిల్లర్ల షరతులకు తలొగ్గి వారు వేసిన తూకానికే విక్రయిస్తున్నారు.

వేగవంతం చేస్తాం



జిల్లాలో పంట ఆలస్యంగా రావటం, ట్రాన్స్‌పోర్టుకు లారీలు దొరకకపోవటం, మిల్లుల సామర్థ్యం తక్కువగా ఉండటంతో కొంత సమస్య ఏర్పడింది. పక్క జిల్లాల్లో గోదాములు తీసుకున్నాం. లారీలు కూడా ఎక్కువ సంఖ్యలో పెడుతున్నాం. ధాన్యం సేకరణ వేగవంతం చేసి ఇబ్బందులు లేకుండా చూస్తాం. మొత్తం ధాన్యం కొనుగోలు చేస్తాం.. రైతులు ఆందోళన చెందవద్దు.

– రాజేశ్, డీఎస్ఓ

మిషన్ కాకతీయతోనే జలకళ

- ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్
- పాల్గొన్న కలెక్టర్ నారాయణరెడ్డి

వికారాబాద్ అర్బన్: మిషన్ కాకతీయ ద్వారానే చెరువులు నిండుకుండలను తలపిస్తున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం వికారాబాద్ నియోజకవర్గంలోని సర్పన్‌పల్లి, శివారెడ్డిపేట్ చెరువుల వద్ద ఏర్పాటు చేసిన ఊరూరా చెరువుల పండుగ కార్యక్రమంలో కలెక్టర్ సి.నారాయణ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా డప్పు దరువుల మధ్య బోనాలు, బతుకమ్మలతో ర్యాలీగా చెరువుల వద్దకు చేరుకొని పూజలు చేశారు. ఎమ్మెల్యే ఆనంద్ మాట్లాడుతూ అన్ని కులాలకు మతాలకు అతీతంగా చెరువుల వద్ద పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గతంలో వేసవి కాలంలో ఎండ తీవ్రతకు చెరువులన్నీ ఎండిపోయేవని మిషన్ కాకతీయ ద్వారా చెరువుల్లో పూడిక తీయడంతో జలకళ సంతరించుకున్నట్లు తెలిపారు. తొమ్మిది ఏళ్లుగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను వివరించేందుకు దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ నారాయణరెడ్డి మాట్లాడుతూ రైతుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమా పథకాలను ప్రవేశపెట్టి వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే తో పాటు అధికారులు, ప్రజా ప్రతినిధులు ఆడిపాడారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్ శర్మ, అసిస్టెంట్ ట్రెనీ కలెక్టర్ సంచిత్ అగర్వాల్, మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



డప్పు కొడుతున్న ఎమ్మెల్యే, కలెక్టర్

దశాబ్ది ఉత్సవాల్లో విషాదం

- లారీ ఢీకొని వీఆర్ఏ దుర్మరణం
- చెరువులో ఓ వ్యక్తి గల్లంతు
- వేర్వేరు చోట్ల ఘటనలు



వీఆర్ఏ ఎండీ సలీం (ఫైల్)

తాండూరు రూరల్/మోమిన్‌పేట: రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో విషాదం నెలకొంది. లారీ ఢీకొని వీఆర్ఏ దుర్మరణం చెందగా, చెరువులో ఓ వ్యక్తి గల్లంతు అయ్యారు. వేర్వేరు చోట్ల జరిగిన ఈ ఘటనల వివరాలిలా ఉన్నాయి. తాండూరు మండలం గౌతాపూర్‌కు చెందిన ఎండీ సలీం(55) వీఆర్ఏగా విధులు నిర్వహిస్తున్నారు. చెరువు వద్ద ఉత్సవాలు ముగిసిన తరువాత ఇంటికి వెళ్తున్న మహిళలను రోడ్డు దాటిస్తున్న క్రమంలో ఓగిపూర్ నుంచి వస్తున్న లారీ సలీంను ఢీకొట్టింది. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహన్ని తాండూరులోని జిల్లా ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య హనీఫ బేగం, కుమారులు ఖలీం, అలీం, సమీర్‌లు ఉన్నారు

మోమిన్‌పేటలో..

మోమిన్ పేట మండల పరిధిలోని దేవరంపల్లికి చెందిన పి.శేఖర్‌రెడ్డి(38) చెరువుల పండుగలో భాగంగా గ్రామస్తులతో కలిసి చెరువుకు వచ్చారు. బతుకమ్మలను విడిచే క్రమంలో చెరువులోకి దిగారు. ఈత కొట్టుకొంటూ కొద్ది దూరం వెళ్లాక మునిగి పోయాడు. సమాచారం తెలుసుకొన్న ఎస్ఐ సంఘటనా స్థలానికి చెరుకుని గాలించినా లభ్యం కాలేదు. తహసీల్దార్ కిరణ్‌కుమార్ సంఘటన స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు. మృతునికి భార్య స్వాతి, కూతురు ఉన్నారు.

పరిహారం కోసం రైలు పట్టాలపై నిరసన

- చెట్టినాడు ఫ్యాక్టరీ మోసం చేసిందంటూ బాధితుడి ఆరోపణ
- ఫ్యాక్టరీ ప్రతినిధుల దాడి
- బాధితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు



నిరసన తెలుపుతున్న బాధితుడు

తాండూరు రూరల్: రైల్వే ట్రాక్ నిర్మాణంలో భూమి కోల్పోయిన బాధితుడు న్యాయం కోసం రైలు పట్టాలెక్కారు. పట్టాలపై కూర్చొని నిరసన తెలిపారు. ఈ ఘటన గురువారం మండల పరిధిలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. తాండూరు నుంచి కర్ణాటక సరిహద్దులో ఉన్న చెట్టినాడు సిమెంట్ ఫ్యాక్టరీ వరకు రైల్వే ట్రాక్ నిర్మించారు. ట్రాక్ నిర్మాణంలో మల్కాపూర్‌కు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యుడు రాజారాం సంబంధించిన పట్టాభూమి సర్వే నంబర్ 78(ఏ)లో 2 ఎకరాల 30 గుంటల భూమి కోల్పోయాడు. పరిహారం నామమాత్రంగా ఇచ్చారని బాధితుడు తెలిపారు. అయితే అప్పట్లో తనకు చెట్టినాడు ఫ్యాక్టరీలో కాంట్రాక్టు ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారన్నారు. ఐదేళ్లకు పైగా అవుతున్నా ఉద్యోగం ఇవ్వకపోవడంతో చేసేదిలేక తన సోదరుడి కుమారుడు చిరంజీవితో కలిసి ట్రాక్‌పై నిరసనకు దిగినట్లు బాధితుడు తెలిపారు. ఈక్రమంలో గూడ్స్ రైలు వస్తుండగా ఆపే యత్నం చేయడంతో చెట్టినాడు ఫ్యాక్టరీ యాజమాన్యం ప్రతినిధులు భీంరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాస్‌లు రాజారాంపై దాడి చేశారు. దీంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ఫ్యాక్టరీ ప్రతినిధులు రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో రాజారాంను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు. ఉద్యోగం ఇస్తామని చెప్పి మోసం చేసిన చెట్టినాడు యాజమాన్యంపై చర్యలు తీసుకోకుండా తనపై దాడి చేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు తుక్కుగూడలో మంత్రి పర్యటన

మహేశ్వరం: తుక్కుగూడ మున్సిపల్ పరిధిలోని మంఖాల్ 6, 7, 8 వార్డుల్లో రూ.1.36 కోట్ల నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శుక్రవారం మంత్రి సబితారెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం గొల్లకుర్మలకు గొర్రెలు పంపిణీ చేస్తారని మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రామ్ తెలిపారు.

మత్స్యశాఖ సొసైటీలకు లైసెన్సుల అందజేత

కందుకూరు: నూతనంగా ఏర్పడిన మత్స్యకార సొసైటీలకు మంత్రి సబితారెడ్డి గురువారం లైసెన్సులు అందజేశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో కందుకూరు, నేదునూరు, పులిమామిడి గ్రామాలకు చెందిన సొసైటీలకు అనుమతి పత్రాలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కిషన్‌రెడ్డి, ఎమ్మెల్సీ మల్లేశం, జెడ్పీచైర్‌పర్సన్ అనితారెడ్డి, మత్స్యకారుల సొసైటీ సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధిలో జెడ్పీల పాత్ర అమోఘం

- జార్ఖండ్ బృందం కితాబు

అనంతగిరి: స్థానిక సంస్థల పరిపాలనలో జిల్లా పరిషత్‌ల పాత్ర భేషుగ్గా ఉందని జార్ఖండ్ బృందం కొనియాడింది. ఇక్కడి గ్రామాల అభివృద్ధిలో జెడ్పీలే ముఖ్య భూమిక పోషిస్తున్నాయని కొనియాడారు. తెలంగాణలో పంచాయతీ రాజ్ చట్టంపై అధ్యయనానికి జార్ఖండ్ రాష్ట్రంలోని 22 జిల్లాల పరిషత్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు వికారాబాద్ కు వచ్చి జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డితో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి చేపడుతున్న చర్యలు, నిధుల మంజూరుపై అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ గ్రామాలు బాగా అభివృద్ధి చెందాయని బృందం అభిప్రాయపడింది. చేపడుతున్న అభివృద్ధి పనులపై సునీతారెడ్డి వారికి వివరించారు. అనంతరం బృందం కలెక్టరేట్ ను సందర్శించింది. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ విజయ్ కుమార్, జెడ్పీటీసీ సభ్యులు అరుణా చౌహాన్, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల, సీఈఓ జానకీరెడ్డి, డిప్యూటీ సీఈఓ సుభాషిని పాల్గొన్నారు.



జెడ్పీ చైర్ పర్సన్ సునీతారెడ్డితో జార్ఖండ్ బృందం

క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

తాండూరు టౌన్: పట్టణంలోని నగరేశ్వర ఆలయ నూతన పాలకవర్గం నియామకానికి దేవాదాయ శాఖ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఈ మేరకు గురువారం దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఆసక్తి గల వ్యక్తులు నోటీసు జారీ చేసిన తేదీ నుంచి 20 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇట్టి దరఖాస్తులను దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా డిప్యూటీ కమిషనర్ కార్యాలయానికి పంపాలని తెలిపారు.

చెరువులో పడి వ్యక్తి మృతి

కుల్కచర్ల: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... బొంరెడ్డిపల్లికి చెందిన ఎండీ గౌస్(31) బహిర్భూమి కోసం చెరువు వద్దకు వెళ్లాడు. ఈ క్రమంలో అతనికి ఫిట్స్ రావడంతో చెరువులో పడి మృతి చెందాడు. చెరువు గట్టుపై చెప్పులు, ఫోన్ ఉండడాన్ని గమనించిన వ్యక్తులు గ్రామస్తులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి భార్య షభానా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీశైలం తెలిపారు.

కారు ఢీకొని విశ్రాంత ఉద్యోగి మృతి

శంకర్‌పల్లి: కారు ఢీకొనడంతో ఓ విశ్రాంత ఉద్యోగి మృతి చెందాడు. ఈ సంఘటన శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఎద్దు మైలారం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి(67) హైదరాబాద్ మెట్రో వాటర్ వర్క్స్ అండ్ సివరేజ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి 2015లో రిటైర్డ్ అయ్యారు. అనంతరం భార్య పిల్లలతో కలిసి శంకర్‌పల్లిలో నివాసం ఉంటున్నారు. గురువారం ఉదయం లూనా వాహనంపై ఎత్తుమైలారంలోని పొలం వద్దకు వెళ్లి, తిరిగి శంకర్‌పల్లికి వస్తుండగా షుగర్ ఫ్యాక్టరీ మలుపు వద్ద అతివేగంతో వచ్చిన కారు లూనాను ఢీకొట్టింది. దీంతో రామచంద్రరెడ్డి తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ:18K. ఏజెంట్ కమీషన్6K.Ph: 9963114535/ 7287061111 [H-793435]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

CITATION

IN THE COURT OF SENIOR CIVIL JUDGE AT SEDAM

F.D.P. 5 /2019

Timmareddy and others V/s Tippamma and others

To,

1. Venkatamma W/o Krishnareddy Sangapol, Age: 57 years, Occ: Household R/o Matoor Tq: Kodangal Dist: Vikarabad (T.S.)

....Respondent No.3

2. Venkatamma W/o Bhimreddy Age: 54 Years Occ: Household, R/o Itkal Tq: Sedam

3. Padmamma W/o Venkatreddy D/o Chandappa Age: 52 Years, Occ: Household, R/o Narsapur Mandal Damargidda, Dist: Narayanpet(T.S.)

4. Gangamma W/o Ramreddy D/o Chandappa Age: 50 years, Occ: Household, R/o Yadlapur, Tq: Gurumitkal, Dist: Yadgir.

....Respondent No.6a to c

5. Shailaja D/o Narashimhareddy Age: 3 Years minor, Occ: Gundepalli (Balampeta), Mandal Daulatabad, Dist: Vikarabad (T.S.) through next friend Narashimhareddy S/o Sangareddy Age: About 32 Years, Occ: Gundepalli (Balampeta), Mandal Daulatabad, Dist: Vikarabad (T.S.)

6. Narashimhareddy S/o Sangareddy Age: About 32 Years, Occ: Gundepalli (Balampeta), Mandal Daulatabad, Dist: Vikarabad (T.S.)

.... Respondent No.10a and 10b

Where as Timmareddy S/o Saireddy @ Sayappa Rudrawaram Age: 64 years, Occ: Teacher and Agriculture R/o Itkal, Tq: Sedam Dist: Kalaburagi and others have filed above case for drawing final decree asper Preliminary decree against Tippamma W/o Chandappa Rudrawaram and others of Itkal Village, Tq: Sedam Dist: Kalaburagi Karnataka and same is pending for adjudication and for allotting share in joint family properties. Where in you at sl.no.1 is Defendant No.3 and sl.2 to 4 are Defendant No.6a to c and sl.No.5 and 6 are defendants No.10a and 10b in the above case.

Therefore you are hereby given notice to appear in this court on 17/7/2023 At 11 A. M. either in person or by an Advocate duly instructed and to file objection if any, Take notice that in default of your appearance on the day mentioned above the matter will be decided in your absence.

Given under my hand and the seal of the court on this the Day 07 June 2023.

Civil Clerk

Sd/- **R. Narayanreddy** Advocate for plaintiff

Sd/- **Chief Minister Office, Senior Civil Judge Court SEDAM**

ఎమ్మెల్యే గారూ.. ఇదేం పద్ధతి

- చెరువుల పండుగ జరుపుకోమని అడ్డుకుంటారా?
- పుట్టపహాడ్ గ్రామస్తుల ఆగ్రహం
- పరిగి – మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో
- దిష్టిబొమ్మ దహనం



రాస్తారోకో నిర్వహిస్తున్న పుట్టపహాడ్ ప్రజలు



ఎమ్మెల్యే దిష్టిబొమ్మను దహనం చేస్తున్న ఆందోళనకారులు

కుల్కచర్ల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగను ఘనంగా నిర్వహించాలని సూచించిన ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి పరోక్షంగా వేడుకలను అడ్డుకోవడం ఏమిటని పుట్టపహాడ్ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని పుట్టపహాడ్ గ్రామ ఎట్టి చెరువు వద్ద వేడుకలు నిర్వహించడానికి గ్రామస్తులు చేరుకున్నారు. అయితే మహ్మదాబాద్ మండలం గాధిర్యాల్ గ్రామ సర్పంచ్ చెరువు వద్దకు చేరుకొని ఇక్కడ ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించరాదన్నారు. ఈ చెరువు శివారు అంశం కోర్టు పరిధిలో ఉందని ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం నియోజకవర్గ ప్రజాప్రతినిధులకు తెలిసింది. రెండు గ్రామాల నేతలను సమన్వయం చేయాలని చూశారు. అది కుదరకపోవడంతో, వేడుకల మరో చెరువు వద్ద నిర్వహించుకోవాలని ఇరిగేషన్ అధికారులు పుట్టపహాడ్ ప్రజలకు సూచించారు. దీంతో ఆగ్రహించిన జనం ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. పరిగి – మహబూబ్‌నగర్ ప్రధాన రహదారిపై రాస్తారోకో చేశారు. విషయం తెలుసుకున్న డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, స్థానిక నేతలు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. మూడు గంటల పాటుగా రాస్తారోకో సాగింది. విషయం తెలుసుకొని ఘటనా స్థలానికి చేరుకున్న సీఐ వెంకట్రామయ్య, ఎస్ఐలు శ్రీశైలం, విఠల్‌రెడ్డి, విశ్వజన్ నిరసనకారులతో మాట్లాడారు. ఇరిగేషన్ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు.

రైతు సంక్షేమానికి పెద్ద పీట

జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి



కోట్‌పల్లి సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

బంట్వారం: రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జెడ్పీ చైర్‌పర్సన్ పట్నం సునీతారెడ్డి అన్నారు. గురువారం కోట్‌పల్లిలో నిర్వహించిన చెరువుల పండుగలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణలో చెరువుల అభివృద్ధి ఎంతగానో జరుగుతోందన్నారు. మిషన్ కాకతీయలో తాతల కాలం నాటి చెరువుల పునరుద్ధరణ జరిగిందన్నారు. చెరువులు నిండా నీటితో కళకళలాడుతున్నాయని ఆమె సంతృప్తి వ్యక్తం చేశారు. అంతకుముందు ఆమె మైసమ్మ దేవాలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ విజయలక్ష్మి, ఎంపీటీసీ మహేశ్‌గౌడ్, బీఆర్‌ఎస్ యువజన విభాగం రాష్ట్ర నాయకుడు బీ నందు, మత్స్య సహకార సంఘం మాజీ అధ్యక్షుడు ఎస్ బందయ్య తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

శంకర్‌పల్లి: మండల పరిధిలోని బుల్కాపూర్ గ్రామ సమీపంలో ఓ గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. బుల్కాపూర్ రాఘవేంద్రస్వామి దేవాలయం వద్ద స్థానికులు గుర్తుతెలియని వ్యక్తి(50) మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉండటంతో వారం రోజుల క్రితం మృతి చెంది ఉండవచ్చని.. భిక్షాటన చేసే వ్యక్తి అయి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అతని వద్ద ఎలాంటి ఆధారాలు దొరకలేదు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



బీఆర్‌ఎస్ నియోజకవర్గ యువజన అధ్యక్షుడు నరేశ్‌గౌడ్ నిశ్చితార్థం గురువారం లగచర్ల గ్రామంలో జరిగింది. ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి హాజరై కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. దుద్యాల మండల కేంద్రానికి చెందిన నరేశ్‌గౌడ్‌కు లగచర్ల గ్రామానికి చెందిన అఖిలతో పెళ్లి నిశ్చయం జరిగింది. - బొంరాస్‌పేట

రాబోయేది మా ప్రభుత్వమే

బీజేపీ నాయకుడు విజయ్‌కుమార్

షాబాద్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని నియోజకవర్గం బీజేపీ నాయకుడు పర్రీ తులసిరామ్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని సోలీపేట్‌లో గడపగడపకూ బీజేపీ పర్యటించి కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఎన్నికలకు కేవలం నాలుగు నెలల సమయం మాత్రమే మిగిలి ఉందని తెలిపారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రతి కార్యకర్త గ్రౌండ్‌లెవల్‌లో కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. మోదీ తొమ్మిదేళ్ల పాలన విజయాలను ప్రజలోకి తీసుకెళ్లడానికి జన సంపర్క్ అభియాన్ కార్యక్రమానికి రూపొందించిన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీఎస్ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు యాదిరెడ్డి, నాయకులు స్వామి, రమేష్‌యాదవ్, మహేందర్‌చారి, సురేందర్ తదితరులున్నారు.

బైక్‌ను ఢీకొన్న స్కూటీ: యువకుడి మృతి



యుగేందర్ మృతదేహం

కేశంపేట: బైక్‌ను స్కూటీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. ఈ సంఘటన కేశంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని లేమామిడి గ్రామ శివారులో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం జేపీ తండాకు చెందిన పాత్లావత్ యుగేందర్ (21)కు ఇటీవల షాద్‌నగర్ పోస్టాఫీసులో ఉద్యోగం వచ్చింది. పని నిమిత్తం తలకొండపల్లి మండలం పాతకోటతండాకు చెందిన నవీన్‌తో కలసి స్కూటీపై షాద్‌నగర్‌కు బయలుదేరాడు. నవీన్ స్కూటీ నడుతుండగా..యుగేందర్ వెనకాల కూర్చున్నాడు. మండల పరిధిలోని లేమామిడి గ్రామ శివారులోని గాంధీ శంకర్‌పల్లి వద్ద చేరుకోగానే.. ముందు వెళ్తున్న బైక్‌ను స్కూటీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రోడ్డుపై పడటంతో తలకు తీవ్ర గాయమైంది. దీంతో యుగేందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ధనుంజయ్ తెలిపారు.

మోమిన్‌పేటలో గాలివాన బీభత్సం



మోమిన్‌పేటలో కూలిన టెంటు

మోమిన్‌పేట: మండలంలో గురువారం గాలివాన బీభత్సం సృష్టించింది. చంద్రశేఖర్‌నగర్‌లో మూడు విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. చెట్లు విరిగి పడ్డాయి. విద్యుత్ తీగలపై చెట్లు విరిగి పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మోమిన్‌పేట, ఏన్కతల, టేకులపల్లిలో చెరువుల పండుగకు అంతరాయం ఏర్పడింది. మోమిన్‌పేటలో వేసిన టెంటు కూలిపోయింది. కుర్చీలు చెల్లాచెదురయ్యాయి. ప్రజలు గాలి వానకు ఇబ్బందులు పడ్డారు. మోమిన్‌పేటలో మహమ్మద్ ఇంటి పై రేకులు ఎగిరిపడ్డాయి.



మోమిన్‌పేటలో ఎగిరిపడిన ఇంటి పైకప్పు రేకులు

మహిళా సంఘాల పనితీరు భేష్

ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధికారుల బృందం కితాబు



కనకమామిడిలో ఉత్తరప్రదేశ్ అధికారుల బృందానికి మహిళా సంఘాల గురించి వివరిస్తున్న సర్పంచ్

మొయినాబాద్/మొయినాబాద్ రూరల్: తెలంగాణ రాష్ట్రంలో మహిళా సంఘాల పనితీరు బాగుందని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర అధికారుల బృందం కితాబిచ్చింది. ఉత్తరప్రదేశ్‌కు చెందిన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, బ్యాంకు అధికారుల బృందానికి చెందిన 25 మంది రాజేంద్రనగర్‌లోని జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థలో స్వయం సహాయక సంఘాల ఆర్థిక బలోపేతం, సంఘాల పనితీరు వంటి అంశాలపై ఐదు రోజుల పాటు శిక్షణ పొందడానికి వచ్చారు. ఇందులో భాగంగా గురువారం మొయినాబాద్, కనకమామిడిలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశమయ్యారు. బ్యాంకుల ద్వారా రుణాలు తీసుకుని ఎలాంటి వ్యాపారాలు చేస్తున్నారని.. ఉపాధి ద్వారా ఆదాయం ఎలా పొందుతున్నారని మహిళలను అడిగి తెలుసుకున్నారు. బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలతో కిరాణ షాపులు, ఫ్యాన్సీ షాపులు, మొబైల్ టిఫిన్ సెంటర్‌లు, ఇస్తరాకుల తయారీ, టైలరింగ్ షాపులు పెట్టుకున్నామని.. కొంత మంది వ్యవసాయానికి అనుబంధంగా పాడి పరిశ్రమను ఏర్పాటు చేసుకుని ఆదాయం పొందుతున్నామని మహిళలు వివరించారు. అలాగే.. పలు రకాల సామాజిక కార్యక్రమాల్లో కూడా భాగస్వాములం అవుతున్నామన్నారు. స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలు ఆర్థికంగా బలోపేతం అవుతున్నారని, ఈ విధానాన్ని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని అధికారులు తెలిపారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ డీపీఎం స్వర్ణలత, ఏఈఎం రవీందర్, సీసీ జంగయ్య, మహిళా సంఘాల అధ్యక్షులు మనీలా, భార్గవి, అశ్విని, వాణి, రేణుక, నస్రీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి



అనిల్‌కుమార్(ఫైల్)

కందుకూరు: విద్యుదాఘాతంతో ఓ కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కృష్ణంరాజు కథనం ప్రకారం.. మండల పరిధిలోని రాచులూరుకు చెందిన అనిల్‌కుమార్‌యాదవ్(35) గతంలో విద్యుత్ శాఖలో పనిచేసి మానేశాడు. ప్రస్తుతం గ్రామంలో పాల బూత్ నిర్వహణతో పాటు ఖాళీ సమయాల్లో విద్యుత్ అధికారుల పర్యవేక్షణలో కరెంట్ మరమ్మతు పనులు చేయడానికి వెళ్తుంటాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం బైరాగిగూడ సమీపంలో విద్యుత్ లైన్‌కు మరమ్మతులు చేస్తున్నాడు. స్తంభం పైకి ఎక్కి మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా అయింది. దీంతో విద్యుదాఘాతానికి గురైన యాదవ్.. స్తంభంపై నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

‘లక్ష్మీదేవిపల్లి’పై ప్రభుత్వాల నిర్లక్ష్యం

- కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆల్‌ఇండియా కన్వీనర్ లక్ష్మయ్య

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంతోనే లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణం నిలిచిపోయిందని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి ఆల్ ఇండియా కన్వీనర్ బండారి లక్ష్మయ్య ఆరోపించారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ ప్రతిపక్షాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన రిలేనిరాహార దీక్షలు గురువారం 7వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలకు ప్రజా సంఘాలు, బహుజన సంఘాల నేతలు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మయ్య మాట్లాడుతూ.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణలో మళ్లీ ఉద్యమాలు చేయాల్సిన పరిస్థితులు రావడం పాలకులకు సిగ్గుచేటని విమర్శించారు. కోట్ల రూపాయల నిధులను వృథా చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని ఎందుకు చేపట్టడం లేదని ప్రశ్నించారు. సమస్యలపై ప్రశ్నించిన వారిపై ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తుందని మండిపడ్డారు. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణాన్ని చేపట్టే వరకు ఉద్యమానికి మా మద్దతు ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు అర్జునప్ప, రవీంద్రనాథ్, తిరుమలయ్య, నర్సింలు, సరోజిని, రాజు, గోవిందు, మోహనకృష్ణ, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

మిషన్ కాకతీయతో చెరువులకు జలకళ



చింతపట్ల లక్ష్మణ్ చెరువు వద్ద మహిళలతో ఎమ్మెల్యే మంచిరెడ్డి

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- మత్స్యసంపదతో ముదిరాజులకు ఉపాధి
- చింతపట్లలో ఘనంగా చెరువుల పండుగ

యాచారం: మిషన్ కాకతీయ పనులతోనే చెరువులు, కుంటలకు జలకళ సంతరించుకుందని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం మండల పరిధిలోని చింతపట్ల లక్ష్మణ్ చెరువు వద్ద చెరువుల పండుగ నిర్వహించారు. కట్టపై ఉన్న మైసమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మంచిరెడ్డి మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం డివిజన్‌లో నాలుగు విడతల్లో రూ.421 కోట్ల నిధులతో చెరువులు, కుంటల్లో పూడికతీత పనులు చేయించినట్లు తెలిపారు. చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటంతో మత్స్య సంపద పెరిగిందన్నారు. దీంతో ముదిరాజులు లక్షలాది రూపాయల ఆదాయం పొందుతున్నారని పేర్కొన్నారు. చింతపట్ల లక్ష్మణ్ చెరువు కట్ట విస్తరణకు రూ.10 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం గ్రామంలోని బొడ్రాయిని సందర్శించి పూజలు నిర్వహించారు. అలాగే.. సీఎంకప్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన చింతపట్ల గ్రామానికి చెందిన వాలీబాల్ క్రీడాకారిణి శివానిని ఘనంగా సత్కరించి రూ.1,500 నగదు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కొప్పు సుకన్య, జెడ్పీటీసీ చిన్నోళ్ల జంగమ్మ, సర్పంచ్ లిక్కి సరిత, ఎంపీటీసీ సభ్యురాలు తాండ్ర లక్ష్మమ్మ, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

కేసులను సత్వరం పరిష్కరించుకోవాలి

విశ్రాంత న్యాయమూర్తి సాంబశివరావు



చేవెళ్ల లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న విశ్రాంత న్యాయమూర్తి సాంబశివరావు

చేవెళ్ల: లోక్ అదాలత్‌ల ద్వారా ట్రాఫిక్ కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని విశ్రాంత న్యాయమూర్తి సాంబశివరావు అన్నారు. చేవెళ్లలో గురువారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. ట్రాఫిక్ కేసులను ఎక్కువ రోజులు పెండింగ్‌లో పెట్టవద్దని చెప్పారు. లోక్ అదాలత్‌లను సద్వినియోగం చేసుకుని కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ నెల 10వ తేదీ వరకు నిర్వహించే లోక్‌అదాలత్‌లో ట్రాఫిక్, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులను పరిష్కరించుకోవాలన్నారు. ఈ సందర్భంగా చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని 65 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వాసు, ఎస్సైలు విఠల్‌రెడ్డి, బాల్‌రాజ్, ఏఎస్సై చందర్, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో అధిక దిగుబడులు

శాస్త్రవేత్తలు డాక్టర్ బ్రజేంద్ర, డాక్టర్ కుమార్

షాబాద్: రైతులు ప్రతి సంవత్సరం భూసార పరీక్షలు చేసుకోవాలని రాజేంద్రనగర్ వరి పరిశోధన సంస్థ శాస్త్రవేతలు డాక్టర్ బ్రజేంద్ర, డాక్టర్ కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని తిర్మలాపూర్, ముదెంగూడ, రేగడిదోస్వాడ, మిట్టకంకల్ గ్రామాల రైతులకు భారతీయ వరి పరిశోధన సంస్థ రాజేంద్రనగర్ వారి సహకారంతో సేవాస్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో భూసార పరీక్ష ఆవశ్యకతపై షెడ్యూల్ కులాల రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నేలలో ఉండాల్సిన పోషకాలు సమపాళ్లలో ఉన్నప్పుడు పంటల సాగులో పెట్టి పెట్టుబడులు తగ్గి మంచి దిగుబడులు పొందే అవకాశం ఉందన్నారు. రైతులు విధిగా నేల పరీక్షలు జరిపి పోషక లోపాలు సరిచేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు స్థాయిలో ప్రధాన పోషకాలు నత్రజని, పోటాష్, భాస్వరం పరీక్ష చేసే విధానంపై శిక్షణ ఇచ్చారు. సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ మాట్లాడుతూ.. జిల్లాలో తమ ఫౌండేషన్ ద్వారా రైతులకు చేస్తున్న సేవలు వివరించారు. రైతులకు నేలను సారవంతం చేయడానికి చేపట్టాల్సిన చర్యలు గురించి వివరించారు. పశువుల ఎరువు, పచ్చిరొట్ట పైర్లు వేసి భూమిలో కలియదున్నడం, జీవన ఎరువులు, పంట మార్పిడి, చెరువు మట్టి వంటివి రైతులు తమ నేల సారవంతం చేయుటకు విధిగా పాటించడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరిగి ఆశించిన దిగుబడి పొందే అవకాశం ఉందని రైతులకు సూచించారు. మండల వ్యవసాయ అధికారి వెంకటేశం మాట్లాడుతూ.. రైతులకు పంటల సాగు విధానంలో అనుసరించాల్సిన పద్ధతులు వివరించారు. సాంకేతిక నిపుణులు శ్రీకాంత్, శ్రీనివాస్ మాట్లాడుతూ.. మట్టి నమూనా సేకరణ, పరీక్ష చేసే విధానం గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో రైతులు గోపాల్‌రెడ్డి, అంజయ్య, మహేందర్, నర్సింహులు, బాలయ్య, శంకర్, బందెయ్య, భాస్కర్ తదితరులున్నారు.

విశ్రాంతి భవన నిర్మాణానికి భూమి పూజ

షాద్‌నగర్: మండలంలోని రామేశ్వరంలో ఉన్న ఉత్తర రామేశ్వరస్వామి దేవాలయం ఆవరణలో భక్తుల కోసం విశ్రాంత భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి సహకరిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వెంకట్‌రాంరెడ్డి, సర్పంచ్ సంపత్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, ఆశన్నగౌడ్, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బాధితురాలికి న్యాయం చేయాల్సిందే

షాద్‌నగర్‌రూరల్: వృద్ధురాలు వెంకటమ్మ భూమికి సంబంధించిన పొజిషన్ చూపే వరకు పోరాటం ఆగదని కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు గురుమిళ్ల రాజు అన్నారు. గురువారం పాదయాత్ర ద్వారా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకొని అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. కేశంపేట మండలం, కాకునూరుకు చెందిన వెంకటమ్మ 20 గుంటల భూమికి పట్టా పాసు పుస్తకం, రైతుబంధు, పీఎం కిసాన్ డబ్బులు వస్తున్నాయని అన్నారు. భూమి ఎక్కడ ఉందో రెవెన్యూ అధికారులు పొజిషన్ చూపడం లేదని ఆరోపించారు. రెవెన్యూ అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా భూమిని ఆక్రమణదారుల నుంచి విడిపించడంలేదన్నారు. 12 ఏళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా బాధితురాలికి న్యాయం జరగడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే న్యాయం చేయాలని లేకుండా ఆందోళన తీవ్ర తరం చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బాధిత కుటుంబ సభ్యులు మోహనకృష్ణ, రాణి, సావిత్రిబాయి పూలే మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు సరోజ, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి అఖిల తదితరులు పాల్గొన్నారు.